నేటి నుంచి భూ భారతి అవగాహన సదస్సులు

- ప్రత్యేక ఫార్మట్‌లో ప్రజల నుంచి దరఖాస్తుల స్వీకరణ
- భూ సమస్యలు లేని తెలంగాణే మా లక్ష్యం
- రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

భూ భారతి చట్టంపై గురువారం నుంచి రాష్ట్ర వ్యాప్తంగా అవగాహన సదస్సులతో పాటు దాని అమలుపై ఎంపిక చేసిన నాలుగు మండలాల్లో రెవెన్యూ సదస్సులను నిర్వహిస్తున్నట్టు ఆ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. సదస్సు లక్ష్యాలు, ప్రజల నుంచి ఫిర్యాదులు, సలహాలు తీసుకోవడం తదితర అంశాలపై ఆయన సంబంధిత అధికారులతో బుధవారం హైదరాబాద్‌లో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులకు మంత్రి పలు సూచనలు చేశారు. ప్రయోగాత్మకంగా భూభారతిని అమలు చేసే నాలుగు మండలాల్లో భూ సమస్యలపై ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరించి వాటికి రశీదులను అందజేయాలని ఆదేశించారు. ఇందుకోసం ప్రత్యేక ఫార్మేట్‌లో తయారుచేసిన దరఖాస్తులను రెవెన్యూ సదస్సు ముందురోజే ప్రజలకు ఇవ్వాలని సూచిచాంరు. "ఎలాంటి భూసమస్యలున్నాయి? ఎన్ని ఫిర్యాదులు వస్తున్నాయి? వాటిని ఏవిధంగా పరిష్కరించాలి? రానున్న రోజుల్లో చేపట్టాల్సిన చర్యలు, పోర్టల్‌పై ప్రజాస్పందనను చూసి భవిష్యత్తులో ఏవిధంగా ముందుకు వెళ్లాలి" అనే విషయంపై అధికారులకు పలు సూచనలు చేశారు. వచ్చిన దరఖాస్తులను ఏరోజుకారోజు కంప్యూటర్‌లో నమోదు చేసి సంబంధిత అధికారులకు పంపించాలని వారికి సూచించారు. అవగాహన సదస్సులకు సంబంధించి కలెక్టర్లు ప్రతిరోజూ ప్రతి మండలంలో రెండు కార్యక్రమాల్లో పాల్గొనే విధంగా కార్యాచరణ రూపొందించుకో వాలని ఆదేశాంచారు. మండల కేంద్రాల్లో తహశీల్దార్లు డిప్యూటీ తహశీల్దార్లు రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు, సర్వేయర్లు బృం దాలుగా ఏర్పడి సదస్సులు నిర్వహించాలని సూచించారు.

నారాయణపేట జిల్లా మద్దూర్‌లో ప్రారంభం

నారాయణ్‌పేట జిల్లా మద్దూర్ మండలంలోని కాజాపురం గ్రామంలో పైలట్ ప్రాజెక్ట్‌ను గురువారం తానే స్వయంగా ప్రారంభించనున్నట్లు మంత్రి పొంగులేటి వెల్లడించారు. ఆ తర్వాత వికారాబాద్ జిల్లా పూడూరు గ్రామంలో జరిగే అవగాహనా సదస్సులో పాల్గొంటానని చెప్పారు. 18న ములుగు జిల్లా వెంకటాపురం, ఆదిలాబాద్ జిల్లాలో జరిగే సదస్సులోనూ పాల్గొంటానని మంత్రి పొంగులేటి తెలిపారు. వీటితో పాటు ఖమ్మం జిల్లా నేలకొండపల్లి, కామారెడ్డి జిల్లా లింగంపేట, ములుగు జిల్లా వెంకటాపూర్ మండలాల్లో ప్రయోగాత్మకంగా ఈచట్టాన్ని ప్రారంభిస్తున్నామని వెల్లడించారు.

ఉద్యోగ జెఎసితో మంత్రివర్గ సమావేశం 21కి వాయిదా

ప్రజాశక్తి -హైదరాబాద్‌బ్యూరో

ఉద్యోగులు దీర్ఘకాలంగా ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం ఏర్పాటు చేసిన మంత్రివర్గ ఉపసంఘం సమావేశం మరోసారి వాయిదా పడింది. ఉద్యోగ జెఎసితో మంత్రివర్గ ఉపసంఘ సమావేశం ఈ నెల 21కి వాయిదా వేశారు. తొలుత ఈ నెల 12న నిర్వహించాలని మంత్రివర్గ ఉపసంఘం చైర్మన్, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ప్రకటించారు. అయితే ఆ తేదీన వీలు కాకపోవడంతో ఈ నెల 16కు వాయిదా వేశారు. బుధవారం ఆ సమావేశం జరగలేదు. తీరా ఆ సమావేశాన్ని ఈ నెల 21వ తేదీకి వాయిదా వేశారు. మంత్రివర్గ ఉపసంఘం సమావేశాన్ని వాయిదా వేయడం పట్ల ఉద్యోగ జెఎసి నేతలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

రైతుకు ప్రయోజనం కలిగించేలా ఎఐ సాంకేతిక పరిజ్ఞానం

ప్రజాశక్తి -హైదరాబాద్‌బ్యూరో

రైతులకు అన్ని విధాల ప్రయోజనం కలిగించేలా ఎఐ సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించనున్నట్టు రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. బుధవారం హైదరాబాద్‌లోని సచివాలయంలో వ్యవసాయశాఖ కార్యదర్శి రఘునందన్ రావు , డైరెక్టర్ గోపీతో కలిసి ఈ ఏడాదిలో వివిధ పథకాలతో సాంకేతికత వినియోగించే దిశగా వివిధ సాంకేతిక కంపెనీ ప్రతినిధులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ చీడపీడలను ముందుగానే గుర్తించడం, రైతులను ముందుగానే అప్రమత్తం చేయడం, ప్రకృతి వైపరీత్యాల్లో పంటనష్టంపై త్వరితగతిన అంచనావేయడం, పంటల కొనుగోళ్లకు సంబంధించి ముందుగా దిగుబడులు అంచనా వేయడం, నమోదైన సాగు విస్తీర్ణాలను ఉపగ్రహ ఛాయాచిత్రాల ద్వారా సరిపోల్చడంలో ఎఐ ఉపయోగపడుతుందని వివరించారు.

165 మంది టీచర్లకు స్పౌజ్ బదిలీలు

హైదరాబాద్ బ్యూరో: రాష్ట్రంలో 317 జిఒ బాధిత ఉపాధ్యాయులకు సంబంధించి 165 మంది టీచర్ల స్పౌజ్ బదిలీలకు ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. ఈ మేరకు విద్యాశాఖ కార్యదర్శి యోగితా రాణా బుధవారం ఉత్వర్వులను జారీ చేశారు. రాష్ట్రంలో 317 జిఒ వల్ల స్థానికతను కోల్పోయిన బాధిత ఉద్యోగులు, ఉపాధ్యాయులకు న్యాయం చేస్తామని కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో హామీ ఇచ్చిన విషయం తెలిసిందే. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వెంటనే దామోదర రాజనర్సింహ చైర్మన్‌గా మంత్రివర్గ ఉపసంఘాన్ని నియమించింది. ఆ కమిటీ సిఫారసు మేరకు రాష్ట్రంలో స్పౌజ్ (భార్యాభర్తలు), మ్యూచువల్ (పరస్పర), హెల్త్ (ఆరోగ్యం) కారణాలున్న ఉద్యోగులు, ఉపాధ్యాయులను బదిలీ చేసేందుకు ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. అందులో భాగంగానే 165 మంది ఉపాధ్యాయుల స్పౌజ్ బదిలీలను చేపట్టామని యోగితా రాణా ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. రాష్ట్రంలో ఒకటి నుంచి తొమ్మిదో తరగతి వరకు విద్యార్థుల సమ్మేటివ్ అసెస్‌మెంట్ (ఎస్‌ఎ-2) పరీక్షలు జరుగుతున్నందున స్పౌజ్ బదిలీలు పొందిన ఉపాధ్యాయులను ఈ నెల 22న రిలీవ్ చేయాలని డిఇఒలను ఆదేశించారు. ఈ నెల 23న కేటాయించిన పాఠశాలల్లో రిపోర్టు చేయాలని కోరారు. బదిలీ అయిన ఉపాధ్యాయులు ప్రస్తుతం పని చేస్తున్న జిల్లాలో స్థానికతను కోల్పోయి బదిలీ అయిన కొత్త జిల్లాలో స్థానికులుగా మారతారని స్పష్టం చేశారు. గతంలో 626 మంది ఉపాధ్యాయులకు పరస్పర బదిలీలను చేపట్టిన విషయం తెలిసిందే.

ప్రజా హక్కుల రక్షణ కమ్యూనిస్టుల బాధ్యత

- ఆహారం, ఇల్లు, ఉపాధి, విద్య, ఆరోగ్యం, పింఛను హక్కులుగా ఉండాలి..
- సిపిఎం 24వ మహాసభ తీర్మానాలపై పోరాటంతోనే శ్రీకాంత్‌కు నివాళి
- శ్రీకాంత్ సంస్మరణ సభలో సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు బివి రాఘవులు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ప్రజా హక్కుల పరిరక్షణ కమ్యూనిస్టుల బాధ్యత అని సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు బివి రాఘవులు అన్నారు. మధురైలో ఇటీవల జరిగిన పార్టీ 24వ జాతీయ మహాసభల్లో ఆహారం, ఇల్లు, ఉపాధి, విద్య, ఆరోగ్యం, పింఛన్‌లను దేశంలోని ప్రతి పౌరుడి హక్కులుగా చేయాలని తీర్మానించినట్టు తెలిపారు. ఈ తీర్మానాల అమలుకు ఉద్యమాలు నిర్వహించాలని పిలుపునిచ్చారు. ఈ హక్కుల సాధనే పార్టీ జాతీయ మహాసభలకు ప్రతినిధిగా హాజరై మృతి చెందిన యర్రా శ్రీకాంత్‌కు నిజమైన నివాళి అని తెలిపారు. ఖమ్మంలోని త్రీటౌన్ బోస్ బొమ్మ సెంటర్‌లో నిర్వహించిన సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు యర్రా శ్రీకాంత్ సంస్మరణ సభకు బివి రాఘవులు హాజరై మాట్లాడారు. ట్రంప్ నిర్ణయాల ప్రభావం ప్రపంచవ్యాప్తంగా ఉందన్నారు. గ్రీన్‌కార్డులు, హెచ్1బీ వీసాలనూ రద్దు చేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. స్వేచ్ఛావాణిజ్యంపై ఆంక్షలు తెస్తున్నట్టు చెప్పారు. పార్టీ ఆలిండియా మహాసభల్లో ఇద్దరు కామ్రేడ్స్ గుండెపోటుకు గురయ్యారని, వారిలో ఒక్కరు కేరళ మాజీ మంత్రి మణి.. ఆయన కోలుకున్నారని, కానీ యర్రా శ్రీకాంత్ కోలుకోలేక మృతిచెందటం బాధాకరమన్నారు.

సంస్మరణలో సభలో మాట్లాడుతున్న రాఘవులు

ప్రజా హక్కుల రక్షణకు ఉద్యమాలు

నాలుగు లేబర్ కోడ్‌లను మే నెల నుంచి అమలు చేస్తామని ప్రధాని మోడీ ప్రకటిస్తున్న నేపథ్యంలో వచ్చేనెల 20న దేశవ్యాప్త సమ్మెకు పిలుపునిచ్చామన్నారు. ఈ కోడ్‌లు అమలైతే కార్మికులు తమ సదుపాయాలన్నింటినీ కోల్పోతారని ఆందోళన వ్యక్తం చేశారు. నూతన వక్ఫ్ చట్టాన్ని నిరసిస్తూ దేశవ్యాప్తంగా ఉద్యమాలు చేయాలని కోరారు. ఛత్తీస్‌గఢ్, బస్తర్ ప్రాంతాల్లో మావోయిస్టుల పేరుతో గిరిజనులను హతమారుస్తున్నారని తెలిపారు. గిరిజనులను తరిమేసి అటవీ సంపదను హస్తగతం చేసుకోవాలనే యోచనలో మోడీ ప్రభుత్వం ఉందన్నారు. ప్రజా హక్కుల పరిరక్షణకు ఉద్యమించాలని రాఘవులు పిలుపునిచ్చారు. సిపిఎం ఆలిండియా 24వ మహాసభలు ఈ మేరకు తీర్మానం చేశాయన్నారు. తినడానికి తిండి, ఉండటానికి ఇల్లు, ప్రతి ఒక్కరికీ ఉపాధి, విద్యా, ఆరోగ్యం, వృద్ధాప్యంలో పింఛన్‌లను పథకాలుగా కాకుండా హక్కులుగా గుర్తించాలని మహాసభలో తీర్మానించినట్టు తెలిపారు. ఈ హక్కుల సాధనకు కమ్యూనిస్టులు ఉద్యమించాలని పిలుపునిచ్చారు.

అమెరికా పన్నులపై నోరు మెదపని మోడీ : తమ్మినేని వీరభద్రం

ప్రపంచీకరణ ప్రక్రియలో భాగంగా ఆచరణలోకి తెచ్చిన స్వేచ్ఛా వాణిజ్యంపై అమెరికా అధ్యక్షులు ట్రంప్ ఆంక్షల్లో భాగంగా పన్నులు విధిస్తున్నారని సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు తమ్మినేని వీరభద్రం అన్నారు. అమెరికాకు పోటీగా మారిన సోషలిస్టు దేశం చైనాను నియంత్రించేందుకు ఆ దేశ ఎగుమతులపై ట్రంప్ 140 శాతం సుంకం విధిస్తున్నాడని తెలిపారు. 44వేల కోట్ల డాలర్ల చైనా ఉత్పత్తులపై పన్నులు విధించిన విషయాన్ని ప్రస్తావించారు. ఈ పన్నులను ప్రపంచవ్యాప్తంగా అన్ని దేశాలు వ్యతిరేకిస్తున్నా ప్రధాని మోడీ నోరువిప్పటం లేదన్నారు. ప్రపంచ పెట్టుబడిదారీ విధానానికి అమెరికా నాయకత్వం వహిస్తుందన్నారు. బతుకే భారమయ్యే రోజులు రాబోతున్నాయని, ఆ రోజు కాపాడేది కమ్యూనిస్టులేనని, కష్టాలొస్తే కమ్యూనిస్టుల దగ్గరకు రావాల్సిందేనని తెలిపారు.

అసమానతలపై ఉద్యమాలు : జాన్‌వెస్లీ

దోపిడీ, అసమానతలను రూపుమాపటమే కర్తవ్యంగా ఉద్యమాలు నిర్వహించాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ పిలుపునిచ్చారు. శాస్త్రీయ భావాలు పెంపొందుతున్న తరుణంలో మనువాద ధోరణులు, మూఢవిశ్వాసాలను పెంపొందించే శక్తులు పుట్టుకొస్తున్నాయన్నారు. అసమానతలు లేని సమాజం కోసం పోరాడాల్సిన దశలో అందరితో కలిసిపోయి.. ప్రజా మన్ననలు పొందిన నాయకుడు శ్రీకాంత్ దూరం కావటం తీరని లోటన్నారు. ఈ సంస్మరణ సభలో పార్టీ కేంద్ర కమిటీ సభ్యులు ఎస్.వీరయ్య, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్ బాబూరావు, తెలంగాణ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జూలకంటి రంగారెడ్డి, పోతినేని సుదర్శన్‌రావు, బండారు రవికుమార్, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కార్యదర్శి మచ్చా వెంకటేశ్వర్లు, రాష్ట్ర కమిటీ సభ్యులు బుగ్గవీటి సరళ, నగర మేయర్ పునుకొల్లు నీరజ, డాక్టర్ యలమంచిలి రవీంద్రనాథ్, జివి మాల్ అధినేత గుర్రం ఉమామహేశ్వరరావు, ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్ష, కార్యదర్శులు మెంతుల శ్రీశైలం, చిన్నికృష్ణారావు మాట్లాడారు. పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు యర్రా శ్రీనివాసరావు వందన సమర్పణ చేశారు. సభ ప్రారంభానికి ముందు యర్రా శ్రీకాంత్ చిత్రపటానికి పూలమాలలు, పూలు వేసి నివాళులు అర్పించారు. ఆయన మృతికి సంతాపంగా మౌనం పాటించారు. యర్రా శ్రీకాంత్ సంస్మరణ సభ సందర్భంగా నవతెలంగాణ దినపత్రిక ప్రచురించిన ప్రత్యేక సంచికను సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు బివి రాఘవులు, కేంద్ర కమిటీ సభ్యులు తమ్మినేని వీరభద్రం, రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ తదితరులు ఆవిష్కరించారు. ఈ సభలో పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు వై.విక్రమ్, మాచర్ల భారతి, బండి రమేశ్, కళ్యాణం వెంకటేశ్వర్లు, బొంతు రాంబాబు, మాదినేని రమేశ్, భూక్యా వీరభద్రం, బండి పద్మ, సీనియర్ నాయకులు పొన్నం వెంకటేశ్వర్లు, కుటుంబ సభ్యులు భార్య యర్రా సుకన్య, కుమారులు రంజిత్, శ్రవంత్, జ్ఞానేశ్, సోదరులు యర్రా రమేష్, యర్రా గోపి, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

విడిసిలపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి

- మాజీ మంత్రి వి శ్రీనివాస్ గౌడ్

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

విడిసిలపై రాష్ట్ర ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకుని, బాధ్యులను శిక్షించాలని మాజీ మంత్రి వి.శ్రీనివాస్ గౌడ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. నిజామాబాద్ జిల్లా ఎర్గట్ల మండలం తాళ్ళ రాంపూర్ గ్రామంలో శ్రీరామ నవమి రోజు 40 మంది మహిళలను దేవాలయంలోకి రావద్దు అని వీడీసీ పేరు మీద తీర్మానం చేయడం, హుకుం జారీ చేశారని తెలిపారు. రాష్ట్రం ఏర్పాటు అయ్యాక 40 మంది మహిళలను దేవాలయంలోకి రాకుండా బహిష్కరించడం అనేది మొట్టమొదటి సంఘటన అనీ, రాచరికంలో ఉన్నామా? అని ప్రశ్నించారు. వైన్‌షాపులు కల్లు దుకాణాల నుంచి మామూళ్ల వసూలు చేయడం, డబ్బులు ఇవ్వనందుకు చెట్లను నరికి వేయడం, గొర్రెలు ఇవ్వకుంటే మేపడానికి ఊరికి రాకుండా చేయడం, వడ్లు ఇవ్వకుంటే పంటలు వేయొద్దని చెప్పడానికి విడిసికి ఉన్న చట్టబద్ధత ఏమిటని ప్రశ్నించారు. సర్పంచ్ ఎన్నికలు పెట్టకపోవడం వల్ల గ్రామంలో వీడీసీల అరాచకం ఎక్కువయ్యాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే దీనిపై స్పందించి ఒక నిర్ణయం తీసుకోవాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే దీనిపైన సమగ్రమైన విచారణ జరిపించి, దోషులను కఠినంగా శిక్షించి జీవితంలో ఇలాంటి సంఘటనలు మరల పునరావతం కాకుండా చేయాలని కోరారు. విడిసిలపై రాష్ట్ర ప్రభుత్వం సరైన చర్యలు తీసుకోకుంటే పార్టీలకతీతంగా ప్రతి ఒక్కరూ ఆ గ్రామ ప్రజలకు మద్దతుగా ఉండాలని విజ్ఞప్తి చేశారు. ఇలాంటి సంఘటనలు ఎక్కడా జరిగిన హిందూ ధార్మిక సంస్థలు, ప్రతి ఒక్కరు వెంటనే స్పందించి మళ్లీ పునరావృతం కాకుండా చూడాలని కోరారు.

స్మిత సబర్వాల్‌కు గచ్చిబౌలి పోలీసుల నోటీసులు

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

ఐఎఎస్ అధికారి స్మిత సబర్వాల్‌కు రంగారెడ్డి జిల్లా గచ్చిబౌలి పోలీసులు నోటీసులు జారీ చేశారు. కంచె గచ్చిబౌలి భూముల వివాదం విషయంలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఎఐ) ఫొటోను రీ పోస్టు చేసినందుకు ఈ నెల 12వ తేదీన నోటీసులు జారీ చేసినప్పటికీ ఈ విషయంపై వెలుగులోకి రాలేదు. అయితే బుధవారం మరోసారి నోటీసులు జారీ చేయడం చర్చనీయాంశంగా మారింది. రాష్ట్ర ప్రభుత్వం కంచె గచ్చిబౌలి సర్వేనెంబర్ 25లోని 400 ఎకరాల భూమి విషయంలో పూర్తిగా తమ వాదనను ప్రజల ముందు వినిపించేందుకు సిద్ధమైంది. ఈ భూముల వివాదంలో కొంతమంది కావాలనే ప్రభుత్వాన్ని బద్నాం చేస్తున్నారనే విషయంలో ప్రభుత్వం ఇటీవలే హైకోర్టుకు వెళ్లింది. సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారం చేసిన వ్యక్తులపై చర్యలు తీసుకోవడం కోసం కోర్టు నుంచి పర్మిషన్ తీసుకుంది. అందులో భాగంగా కంచె గచ్చిబౌలి భూముల్లో వన్యప్రాణుల పరిస్థితి ఇదంటూ వైరల్ అయిన ఎఐ ఫొటోలను స్మిత సబర్వాల్ సోషల్ మీడియాలో షేర్‌చేయడంతో నోటీసులు అందజేసినట్టు పోలీసులు తెలిపారు. బిఎన్ఎస్ 179 కింద నోటీసులు జారీ చేశారు. పూర్తి వివరాలు తెలిపేందుకు గచ్చిబౌలి పోలీసులు నిరాకరించారు.

29న ఎన్‌డిఎస్‌ఎ చైర్మన్ శ్రీశైలం డ్యామ్ తనిఖీ

- తెలంగాణ ఇఎన్‌సి లేఖకు స్పందన

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

శ్రీశైలం ప్రాజెక్టు డ్యామ్ ప్రమాదంలో ఉందని గతంలో తెలంగాణ నీటిపారుదల శాఖ రాసిన లేఖకు జాతీయ ఆనకట్టల భద్రత సంస్థ(ఎన్‌డీఎస్ఏ) స్పందించింది. ఈనెల 29న శ్రీశైలం డ్యామ్‌ను తనిఖీ చేసేందుకు ఎన్‌డిఎస్ఎ చైర్మన్ అనిల్‌జైన్ రానున్నారు. ఈ మేరకు తెలుగు రాష్ట్రాలకు సమాచారం అందింది. గతంలో శ్రీశైలం ప్రాజెక్టు డ్యామ్ ప్లంజ్ పూల్ ఏరియాలో గుంత ఏర్పడిందని, దానిని సిమెంట్, కాంక్రీట్‌తో పూడ్చడం ద్వారా మరమ్మతు చేయాలని తెలంగాణ నీటిపారుదల శాఖ ఇంజినీర్ ఇన్ చీఫ్ జి అనిల్‌కుమార్ ప్రత్యేకంగా లేఖ రాశారు. అలాగే పలు సమావేశాల్లోనూ చెప్పారు. కేంద్ర జల సంఘం, ఎన్‌డిఎస్ఎ, కేఆర్ఎంబీతోపాటు ఏపీ, తెలంగాణ అధికారులు పాల్గొన్న వీడియోకాన్ఫరెన్స్‌లోనూ శ్రీశైలం డ్యామ్ ప్లంజ్ పూర్ ఏరియాను మరమ్మతు చేసే విషయమై తీవ్రంగానే చర్చ జరిగింది. డ్యామ్ పరిస్థితి దృష్ట్యా అప్పట్లోనే ఎన్‌డిఎస్ఏ చైర్మన్ వెంటనే మరమ్మతులకు చర్యలు తీసుకోవాలని ఆంధ్రప్రదేశ్ నీటిపారుదల శాఖకు ఆదేశాలు ఇచ్చారు. అయినా ఏపీ సర్కారు నుంచి శ్రీశైలం డ్యామ్ ప్లంజ్ పూర్ ఏరియాలో ఏర్పడ్డ గుంతను మరమ్మతు చేయలేదు. ఇదంతా జరిగి ఏడాది కావస్తున్నది. ఆ రాష్ట్రంలో అసెంబ్లీ ఎన్నికలు జరగడం, కొత్త ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ఆలస్యమైంది.

సిఎం దృష్టికి ఉద్యోగోన్నతుల్లో వర్గీకరణ అంశం

- మంత్రి రాజనర్సింహ

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

ఉద్యోగోన్నతుల్లో ఎస్‌సి వర్గీకరణ అమలు చేసే అంశంపై సిఎం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించే ప్రయత్నం చేస్తా నని రాష్ట్ర వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ తెలిపారు. ఇంకేమైనా ఇబ్బందులు, సమస్యలుంటే వాటిని కూడా పరిష్కరించే ప్రయత్నం చేస్తానని స్పష్టం చేశారు. దశాబ్దాల ఎస్‌సి వర్గీకరణ ఆకాంక్ష నెరవేరిన సందర్భంగా సెక్రటేరియట్ ఎస్‌సి మాదిగ ఎంప్లాయిస్ అసోసియేషన్ నాయకులు బుధవారం హైదరాబాద్‌లోని మినిస్టర్స్ క్వార్టర్స్‌లో ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహను కలిసి కృతజ్ఞతలు తెలిపారు. మంత్రిని సన్మానించి తమ సంతోషాన్ని పంచుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గత పదేళ్లుగా పిల్లలను తాగుబోతులుగా మార్చారని ఆవేదన వ్యక్తం చేశారు. వారికి మంచి ఏదో, చెడు ఏదో నేర్పించాలని తెలిపారు. ఆ యువతకు ఉద్యోగులుగా తోడ్పాటునందించాలని కోరారు. ఉపాధి, ఉద్యోగాలు సాధించేందుకు సరైన గైడెన్స్ అందించాలన్నారు. పాలనలో భాగస్వాములై మరింత మందిని భాగస్వాములను చేయాలన్నారు. ఇంకా అత్యంత వెనుకబడిన వారికి అండగా నిలబడాలని కోరారు.

మహారాజశ్రీ ప్రిన్సిపల్ ఫ్యామిలీ జడ్జి వారి కోర్టు - కమ్- 4వ అదనపు జిల్లా కోర్టు, విజయవాడ
Crl.M.P. No.21/2025 in F.C.O.P. (M.C.) No. 1792 / 2023

Between:
శ్రీమతి మంకెన (ఉప్పు) పావని కుమారి .... పిటీషనరు/పిటీషనరు
మరియు
మంకెన శ్రీధర్ ..... రెస్పాండెంటు/రెస్పాండెంటు

టు: రెస్పాండెంటు/రెస్పాండెంట్
మంకెన శ్రీధర్, తండ్రి : మంకెన సుధాకర్
నివాసము: ఫ్లాట్ నెంబర్లు 6 మరియు 7,
ఎన్.టి.పి.సి. గేట్ దగ్గర
ఘనాపురం, అన్నోజిగూడ, ఘట్కేసర్ మండలం
మేడ్చల్ జిల్లా, తెలంగాణ రాష్ట్రము - 500088

పై నెంబరు పిటీషన్ను ఇందలి పిటీషనరు రెస్పాండెంటుపై మనోవర్తి బాకీ వసూలు కొరకు దాఖలు చేసియున్నారు. సదరు పిటీషన్ రెస్పాండెంట్ హాజరు నిమిత్తం ది. 05.05.2025వ తేదీన వాయిదా కలదు. కావున ఇందలి రెస్పాండెంట్ ది.05.05.2025 వ తేదీ ఉదయం గం. 10.30 ని॥ లకు పై కోర్టువారి ఎదుట హాజరై వారి అభ్యంతరములు తెలియచేసుకొన వలెను. లేని యెడల రెస్పాండెంట్ పరోక్షమున తీర్మానం జరుగునని ఇందుమూలముగా తెలియచేయడమైనది.
(కోర్టు వారి ఆదేశంతో)
విజయవాడ
తేది: 16.04.2025 **వేపాటి రాజారత్నం, అడ్వకేట్, విజయవాడ.**

ఉద్యోగ సృష్టికర్తలుగా ఉండండి

- విధాన వ్యవస్థాపకతను అన్వేషించండి
- మిమ్మల్ని మీరు సవాలు చేసుకోండి
- కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

పబ్లిక్ పాలసీలో మాస్టర్స్ డిగ్రీ చేసిన కౌటిల్య విద్యార్థులంతా ఉద్యోగ సృష్టికర్తలుగా ఉండాలని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజారపు రామ్మోహన్ నాయుడు అభిలాషించారు. ప్రతిష్టాత్మక కౌటిల్యా స్కూల్ ఆఫ్ పబ్లిక్ పాలసీ (కెస్‌పిపి) తృతీయ పట్టభద్రుల దినోత్సవాన్ని హైదరాబాద్ గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం ప్రాంగణంలోని కిన్నెర్ సెమినార్ హాల్‌లో బుధవారం ఘనంగా నిర్వహించారు. సంప్రదాయ అకాడమిక్ ప్రొఫెషన్‌తో ప్రారంభమైన ఈ వేడుక జాతీయ గీతాలాపన, జ్యోతి ప్రజ్వలనతో శ్రీకారం చుట్టుకుంది. పబ్లిక్ పాలసీలో మాస్టర్స్ డిగ్రీలను అందుకుంటున్న విద్యార్థులను కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు వాస్తవ ప్రపంచంలోకి అడుగుపెడుతున్నప్పుడు, సమాజంలో అర్థవంతమైన మార్పును సృష్టించే జ్ఞానం, విలువలు, ఉద్దేశాన్ని మీతో తీసుకెళ్లాలని సూచించారు. సంప్రదాయ మార్గాలను మించి ఆలోచించమని గ్రాడ్యుయేట్లను ప్రోత్సహించారు. విధాన వ్యవస్థాపకతను అన్వేషించి, మిమ్మల్ని మీరు సవాలు చేసుకోవాలని కోరారు. 'త్వరగా నేర్చుకోండి, నడవండి, పరుగెత్తండి, ఎగరండి' కానీ ఎల్లప్పుడూ మీ పాదాలను స్థిరంగా ఉంచండని సూచించారు. గీతం అధ్యక్షులు, విశాఖపట్టణం ఎంపి ఎం శ్రీ భరత్ మాట్లాడుతూ.. పబ్లిక్ పాలసీలో మాస్టర్స్ డిగ్రీలు అందుకుంటున్న విద్యార్థులను అభినందించారు. ఈ వేడుకల్లో ముఖ్య అతిథిగా పాల్గొన్న కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడును శ్రీ భరత్ సత్కరించారు. కాగా, ఈ ఏడాది 30 మంది విద్యార్థులకు పబ్లిక్ పాలసీలో మాస్టర్స్ డిగ్రీలను మంత్రి ప్రదానం చేశారు. ఇందులో అత్యుత్తమ ప్రతిభ కనబరచిన విద్యార్థులకు బంగారు పతకాలతో సత్కరించారు. గీతం రిజిస్ట్రార్ డాక్టర్ డి.గుణశేఖరన్, డిగ్రీ రికార్డులను అధికారికంగా గీతం ఉప కులపతి ప్రొఫెసర్ ఎర్రోల్ డిసౌజాకు అందజేశారు. కెఎస్‌పిపి విద్యార్థి వైభవి విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. మాస్టర్స్ పట్టాను అందుకున్న విద్యార్థి షితిజ్ ఝా, 2025 తరగతి సమిష్టి ప్రయాణం, వారి ఆకాంక్షలను ప్రతిబింబిస్తూ గ్రాడ్యుయేషన్ ప్రసంగం చేశారు. అధ్యాపకులు, యాజమాన్యాల అంకితభావం, మార్గదర్శకాలకు గ్రాడ్యుయేషన్ పూర్తి చేసుకున్న విద్యార్థుల తల్లిదండ్రులు హృదయపూర్వకంగా కృతజ్ఞతలు తెలిపారు. చివరిగా, కెఎస్ పిపి అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ వసుధ కట్టు వందన సమర్పణ, ఆ తరువాత జాతీయ గీతాలాపనతో ఈ పట్టాల ప్రదానోత్సవ కార్యక్రమం విజయవంతంగా ముగిసింది. ఈ కార్యక్రమంలో కెఎస్‌పిపి సహ వ్యవస్థాపకులు ప్రతీక్ కన్వాల్, కెఎస్‌పిపి డీన్ ప్రొఫెసర్ సయ్యద్ అక్బరుద్దీన్, గీతం అదనపు ఉపకులపతి ప్రొఫెసర్ డిఎస్ రావు, అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

పట్టభద్రుల దినోత్సవ కార్యక్రమంలో మాట్లాడుతున్న రామ్మోహన్‌నాయుడు

ఇందిరాగిరి సోలార్ జల వికాసం వేగవంతం చేయండి

- అడవులు, గిరిజనుల ఆదాయం పెంచడమే పథకం లక్ష్యం
- డిప్యూటీ సిఎం మల్లు భట్టి విక్రమార్క

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

ఇందిరాగిరి సోలార్ జల వికాసం పథకాన్ని ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా భావిస్తుంది. ఈ పథకానికి సంబంధించిన విధి విధానాల ఖరారులో వేగం పెంచాలని డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క మల్లు అధికారులను ఆదేశించారు. బుధవారం ఆయన హైదరాబాద్‌లోని మహాత్మ జ్యోతిరావు పూలే ప్రజాభవన్‌లో సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. అడవులను పెంచుతూనే, గిరిజనులకు ఆదాయం సమకూర్చడమే ప్రభుత్వ లక్ష్యం అన్నారు. ఈ పథకానికి రూ.12,500 కోట్లు వెచ్చించాలని ప్రాథమికంగా నిర్ణయించినట్టు డిప్యూటీ సీఎం అధికారులకు వివరించారు. గతంలో ఏ ప్రభుత్వము గిరిజనుల వ్యవసాయ అభివృద్ధికి ఇంత పెద్ద మొత్తంలో ఏకకాలంలో నిధులు కేటాయించలేదని చెప్పారు. గిరిజనులకు ఆర్‌వోఎఫ్ఆర్ చట్టం కింద కేటాయించిన భూములను సాగులోకి తీసుకొచ్చేందుకు గిరిజనులను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు ఇందిరా సోలార్ జల వికాసం ఉపయోగపడుతుందన్నారు. పట్టాలు పొందిన గిరిజనుల భూముల్లో జల వనరుల లభ్యత కోసం జియాలజికల్ సర్వే, తదుపరి బోర్లు వేయడం, సోలార్ పంపు సెట్లు బిగించడం అన్ని పనులు ఒకే ఏజెన్సీకి కేటాయించాలని తద్వారా జాప్యం జరగకుండా, గిరిజన రైతులు ఇబ్బందులు పడకుండా పథకం అమలు సులభతరం అవుతుందన్నారు. ఈ పథకం అమల్లో ఉద్యానవన శాఖ పాత్ర కీలకమైందని తెలిపారు. అవకాడో, వెదురు వంటి పంటలు గిరిజనులు సాగు చేసేందుకు కార్యాచరణ రూపొందించాలని సూచించారు. ఇతర రాష్ట్రాల్లో ఈ పంటల సాగు జరుగుతున్న తీరుపై గిరిజన రైతులకు అవగాహన కల్పించేందుకు స్టడీ టూర్లు ఏర్పాటు చేయాలని తెలిపారు. పామాయిల్, వెదురు వంటి పంటలు చేతికి రావాలంటే కనీసం మూడు సంవత్సరాల సమయం పడుతుందన్నారు. ఈలోపు గిరిజనులకు ఆదాయం సమకూరేందుకు అవసరమైన అంతర పంటల సాగును గుర్తించాలని ఉద్యానవన శాఖ అధికారులను ఆదేశించారు. మొదట ఈ పథకాన్ని ఆదిలాబాద్, భద్రాద్రి- కొత్తగూడెం జిల్లాలో పైలెట్ ప్రాజెక్టుగా అమలు చేసేందుకు ఆయా జిల్లా అధికారులతో సంప్రదింపులు జరపాలని డిప్యూటీ సీఎం ఆదేశించారు.

రాజీవ్ యువ వికాసం గేమ్ ఛేంజర్

- యువకుల జీవితాల్లో మార్పు
- జిల్లాస్థాయిలో కలెక్టర్లు, బ్యాంకర్లతో సమావేశం నిర్వహించాలి
- రాజీవ్ యువ వికాసం పథకంపై బ్యాంకర్లతో సమావేశంలో డిప్యూటీ సిఎం భట్టి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాజీవ్ యువ వికాసం పథకంతో నిరుద్యోగుల జీవితాలు మారుతాయి. వారి జీవన ప్రమాణాలు పెరుగుతాయి. రాష్ట్రంలో ఈ పథకం ఒక గేమ్ చేంజర్‌గా అవుతుందని డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క మల్లు తెలిపారు. బుధవారం హైదరాబాద్‌లో మహాత్మా జ్యోతిరావు పూలే ప్రజాభవన్‌లో యువ వికాసం పథకం అమలుపై బ్యాంకర్లతో ప్రత్యేక సమావేశంలో ఆయన మాట్లాడారు. రాజీవ్ యువ వికాసం ఒక సాధారణ సంక్షేమ పథకంగా చూడవద్దని బ్యాంకర్లను కోరారు. మానవీయ కోణంలో రాష్ట్ర ప్రభుత్వంలోని సీనియర్ అధికారులు సుదీర్ఘ సమావేశాలు నిర్వహించి పథకానికి రూపకల్పన చేసినట్టు వివరించారు. ఉమ్మడి రాష్ట్ర చరిత్రలో ఇప్పటివరకు ఇంత పెద్ద మొత్తంలో స్వయం ఉపాధి పథకాలకు ఏనాడు ఏ ప్రభుత్వం కేటాయింపులు చేయలేదని తెలిపారు. కొలువుల కోసం కోరి కొట్లాడి తెచ్చుకున్న తెలంగాణ రాష్ట్రంలో గత పదేళ్లపాటు నిరుద్యోగుల ఆశలు నెరవేరలేదని అన్నారు. ఓ వైపు ప్రభుత్వ ఉద్యోగాలు భర్తీ చేస్తూనే మిగిలిన నిరుద్యోగుల కోసం స్వయం ఉపాధి పథకాన్ని రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకుందని చెప్పారు.

రాజీవ్ వికాసం ద్వారా రాష్ట్రంలో సంపద సృష్టించబడుతుందని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి మొదలు కమిషనర్ల వరకు ఈ పథకం రూపకల్పన, ఎంపికైన వారికి శిక్షణపై తీవ్ర కసరత్తు చేసినట్టు వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం రూ.6,000 కోట్లు ఖర్చు పెడుతుందన్నారు. బ్యాంకర్లు రూ.1,600 కోట్లు లింకేజీ ఇచ్చేందుకు ముందుకు రావాలన్నారు. ఈ పథకంలో బ్యాంకర్లు ఉత్సాహంగా పాల్గొనడం ద్వారా మీకు మంచి పేరు దక్కుతుందనీ, యువ వికాసం పథకం కింద లబ్ధి పొందే యువకులకు వ్యాపారం చేసుకోవడం, లాభాలు సాధించడంపైన అధికారులు కనీసం మూడు రోజుల నుంచి 15 రోజుల వరకు శిక్షణ ఇస్తారని తెలిపారు. వ్యాపారంలో ఇబ్బందులు ఏర్పడితే శిక్షణ సంస్థలు మద్దతు ఇస్తాయని బ్యాంకర్లకు వివరించారు. కమర్షియల్ బ్యాంకర్లు, గ్రామీణ బ్యాంకర్లు పరస్పరం సహకరించుకోవాలని సూచించారు. ఈ పథకాన్ని పకడ్బందీగా అమలు చేసేందుకు జిల్లా స్థాయిలో కలెక్టర్లు బ్యాంకర్లతో త్వరలో సమావేశంలో నిర్వహించాలని డిప్యూటీ సీఎం ఆదేశించారు. అర్హులకు శాంక్షన్ లెటర్లు అందజేసిన తర్వాత రాష్ట్రస్థాయిలో మరోసారి ఎస్ఎల్బీసీ సమావేశం నిర్వహిస్తున్నట్టు తెలిపారు. రాజీవ్ యువ వికాసంలో లబ్ధిదారులకు ప్రభుత్వ వాటా విడుదల చేయగానే, బ్యాంకర్లు లింకేజీ మొత్తాన్ని వెంటనే విడుదల చేయాలని కోరారు. సమావేశంలో ఆర్థిక శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ సందీప్ కుమార్ సుల్తానియా, ఎస్‌సి సంక్షేమ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శ్రీధర్, ఎస్‌టి సంక్షేమ శాఖ సెక్రటరీ శరత్, బిసి సంక్షేమ శాఖ సెక్రటరీ శ్రీధర్, డిప్యూటీ సిఎం స్పెషల్ సెక్రటరీ కృష్ణ భాస్కర్, అన్ని శాఖల బ్యాంకుల అధికారులు పాల్గొన్నారు.

IN THE COURT OF THE CIVIL JUDGE (SENIOR DIVISION) AT AVANIGADDA
I.A. No. 266/2019 in O.S. No. 8/2019

Between :
Talasila Seetha Ramaiah ... Petitioner / Plaintiff
And
Talasila Seshagiri Rao @ 6 others .... Respondents/ Defendants

To,
R6 : Parchuri Kalyani, W/o Krishna Chaitanya, Hindu, aged about 30 years, Properties.
R7 : Kothapalli Sukanya W/o Narendra Chowdary, Hindu, aged about 25 years, Properties
R/o Komala Nagar, Hyderabad, Telangana State.

పై నెంబరు పిటీషన్‌లో రెస్పాండెంట్స్ R6, R7 అయిన మీకు నోటీసు నిమిత్తం చివరిసారిగా వాయిదా ది. 24-4-2025 నాడు శ్రీ కోర్టువారు దయచేసినారు. సదరు వాయిదారోజున మీరు స్వయంగా గానీ, లేదా మీ తరఫు ప్లీడరు ద్వారా గానీ పై కోర్టునందు పై వాయిదారోజున ఉదయం 10-30 గం.లకు హాజరయి మీకు గల ఆక్షేపణలను శ్రీ కోర్టువారికి తెలియపరచ గలరు. లేనిచో మీ పరోక్షమున తీర్మానించెదరు. శ్రీ కోర్టువారి ఉత్తర్వుల ప్రకారం మీకు నోటీసులు ఈ పబ్లికేషన్ ద్వారా తెలియపరచటమైనది.
వాయిదా : 24-4-2025
అవనిగడ్డ.
ది.14-4-21025 ఇట్లు
సనకా రఘురామప్రసాద్, బి.కాం., బి.ఎల్., న్యాయవాది, అవనిగడ్డ.
సెల్ : 99499 88835.

IN THE COURT OF THE CIVIL JUDGE (SENIOR DIVISION) AT AVANIGADDA
I.A. No. 267/2019 in O.S. No. 8/2019

Between :
Talasila Seetha Ramaiah .... Petitioner / Plaintiff
And
Talasila Seshagiri Rao @ 6 others .... Respondents/ Defendants

To,
R6 : Parchuri Kalyani, W/o Krishna Chaitanya, Hindu, aged about 30 years, Properties.
R7 : Kothapalli Sukanya W/o Narendra Chowdary, Hindu, aged about 25 years, Properties
R/o Komala Nagar, Hyderabad, Telangana State.

పై నెంబరు పిటీషన్‌లో రెస్పాండెంట్స్ R6, R7 అయిన మీకు నోటీసు నిమిత్తం చివరిసారిగా వాయిదా ది. 24-4-2025 నాడు శ్రీ కోర్టువారు దయచేసినారు. సదరు వాయిదారోజున మీరు స్వయంగా గానీ, లేదా మీ తరఫు ప్లీడరు ద్వారా గానీ పై కోర్టునందు పై వాయిదారోజున ఉదయం 10-30 గం.లకు హాజరయి మీకు గల ఆక్షేపణలను శ్రీ కోర్టువారికి తెలియపరచ గలరు. లేనిచో మీ పరోక్షమున తీర్మానించెదరు. శ్రీ కోర్టువారి ఉత్తర్వుల ప్రకారం మీకు నోటీసులు ఈ పబ్లికేషన్ ద్వారా తెలియపరచటమైనది.
వాయిదా : 24-4-2025
అవనిగడ్డ.
ది.14-4-21025 ఇట్లు
సనకా రఘురామప్రసాద్, బి.కాం., బి.ఎల్., న్యాయవాది, అవనిగడ్డ.
సెల్ : 99499 88835.

మంజీరాను మరో మూసీ చేయొద్దు

- గుట్టుగా కెమికల్ వ్యర్థాలను వదులుతున్న ఫార్మా, ఇతర కంపెనీలు
- మంజీరా వాగును పరిశీలించిన సిపిఎం బృందం
- ప్రభుత్వం స్పందించే వరకు దశల వారీ ఉద్యమాలు : వక్తలు

నిరసన తెలుపుతున్న సిపిఎం నాయకుల బృందం, గ్రామస్తులు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

నక్కవాగులో కలుస్తున్న కంపెనీల కాలుష్య వ్యర్థాలు మంజీరా నదిలోకి వదలడం ద్వారా స్వచ్ఛమైన మంజీరాను మరో మూసీ నదిగా మార్చొద్దని సిపిఎం నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. వివిధ రకాల పరిశ్రమల్లో వెలువడే కెమికల్ వ్యర్థ జలాలను నక్కవాగులోకి వదలడంతో ఆ నీరు మంజీర వాగులో చేరుతుంది. దానివల్ల మూడు జిల్లాల ప్రజలకు ఉపయోగపడే జలాలు కాలుష్య కోరల్లో చిక్కాయని అన్నారు. బుధవారం సంగారెడ్డి జిల్లాలోని చౌటకూర్ మండలంలోని ఏటిగడ్డ లింగంపల్లిలో మంజీర వాగు వద్ద జల కాలుష్యం, గుర్రపుడెక్క ఆకును పరిశీలించారు. సుమారు 200 మంది స్థానిక ప్రజలు సిపిఎం నాయకుల వెంట కదిలారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు అతిమేల మాణిక్, జి.సాయిలు మట్లాడుతూ.. మంజీర వాగు పరివాహక ప్రాంతంలోని ప్రజలంతా ప్రవహించే నీటితో స్నానాలు చేయడం, ఇతర అవసరాలకు ఆ నీటిని వాడుకునే పరిస్థితి ఉండేదన్నారు. కంపెనీల వ్యర్థాలు వచ్చి చేరడంతో మంజీర నీళ్లతో కనీసం పశువుల్ని సైతం కడగలేని ప్రమాదకర పరిస్థితి ఏర్పడిందన్నారు. నక్కవాగులో చేరుతున్న కాలుష్య నీరంతా ఏటిగడ్డ లింగంపల్లి వద్ద మంజీరా నదిలోకి చేరడంతో నదీ జలాలన్నీ కలుషితమయ్యాయన్నారు.

ఏటిగడ్డ లింగంపల్లి దిగువన 12 అడుగుల కల్వర్టు నిర్మించడం వల్ల నీరంతా వాగులో నిల్వ ఉంటుందని, దాని వల్ల గుర్రపుడెక్క చేరిందన్నారు. వాగులోంచి దుర్గంధపు వాసన వెదజల్లడంతో పాటు ఈగలు, దోమలు వృద్ధి చెందడం వల్ల ప్రజలు నివసించే పరిస్థితి లేకుండా పోతుందని తెలిపారు. కల్వర్టు వల్ల వాగులో నిల్వ ఉన్న నీరే చుట్టుపక్కల వేసే బోరుబావుల్లోకి వస్తున్నాయని, ఆ నీటితో పంటలు పండించడం వల్ల ఆహార పదార్థాలు కలుషితమవుతున్నాయని, పశువులు, పక్షులకు తాపితే చర్మ వ్యాధులు వస్తున్నాయన్నారు. నక్కవాగు కాలుష్య జలాలు మంజీరాలో చేరకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. వాగుకు అడ్డంగా నిర్మించిన కల్వర్టును తొలగించాలన్నారు. మంజీరా జలాలు కలుషితం కావడం వల్ల సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి జిల్లాలోని అనేక పరివాహక ప్రాంత గ్రామ ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తుందన్నారు. ప్రాణాధారమైన మంజీరా జలాలను పరిరక్షించేందుకు అధికారులు, ప్రభుత్వం తక్షణమే చర్యలు తీసుకోవాలని తెలిపారు. కాలుష్య వ్యర్థాలను మంజీరాలో కలుపుతున్న పరిశ్రమలపై చర్యలు తీసుకోవాలన్నారు. ఇప్పటికే ఏటిగడ్డ లింగంపల్లిలో ఏర్పడిన సమస్య గురించి కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లామని, శాశ్వత చర్యలు తీసుకోకపోతే 20 కి.మీ మేర గ్రామ ప్రజలంతా కలెక్టరేట్ వరకు పాదయాత్ర చేపట్టాలని ప్రజలు నిర్ణయించారు. సిపిఎం నాయకులు అండగా ఉంటే తమ సమస్య పరిష్కారం కోసం ఎలాంటి పోరాటాలకైనా సిద్ధంగా కదులుతామని అక్కడికి వచ్చిన వందలాది మంది మహిళలు, రైతులు, యువకులు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జోగిపేట ఏరియా కమిటీ కార్యదర్శి విద్యాసాగర్, నాయకులు బి రాజు, కృష్ణ, శ్రీహరి, సదానందం, మల్లేశం, గ్రామ పెద్దలు, రైతులు పాల్గొన్నారు.

సుప్రీం తీర్పును స్వాగతిస్తున్నాం

- బిఆర్ఎస్ నేతలు

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

కంచ గచ్చిబౌలి భూములపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును స్వాగతిస్తున్నట్టు బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్, మాజీ మంత్రి హరీశ్‌రావు ప్రకటించారు. ఈ మేరకు వారు ఎక్స్‌వేదికగా స్పందించారు. ప్రభుత్వం ధ్వంసం చేసిన అడవులను పునరుద్ధరించాలంటూ కోర్టు ఇచ్చిన ఆదేశాలను పాటించాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శితో పాటు రాష్ట్ర చీఫ్ వైల్డ్ లైఫ్ వార్డెన్‌కు వన్యప్రాణులను కాపాడాలంటూ ఆదేశాలివ్వడం గొప్ప విజయని పేర్కొన్నారు. గొంతులేని మూగజీవాల కోసం, చెట్ల కోసం, పర్యావరణం కోసం అండగా నిలబడిన హైదరా బాద్ సెంట్రల్ యూనివర్సిటీ విద్యార్థులకు వారు ధన్యవాదాలు తెలిపారు. ఆర్థిక అవకతవకలు జరిగే అవకాశముందని అభిప్రాయం వ్యక్తం చేసిన కేంద్ర సాధికారిక కమిటీతో బీఆర్ఎస్ ఏకీభవిస్తుందని తెలిపారు. ఈ ప్రాజెక్ట్‌లో రూ.10వేల కోట్ల అవినీతి జరిగిందని వారు ఆరోపించారు. కోర్టు ఆదేశాల మేరకు విధ్వంసం చేసిన వంద ఎకరాలను ఎలా పునరుద్ధరిస్తారో చెప్పాలన్నారు. పర్యావరణాన్ని, వన్యప్రాణులను విధ్వంసం చేస్తున్న రేవంత్ సర్కార్ వైఖరిని ఎండగట్టాలని వారు ప్రజలకు పిలుపునిచ్చారు.

కాంట్రాక్ట్ అసిస్టెంట్ ప్రొఫెసర్లను రెగ్యులర్ చేయాలి

- యూనివర్సిటీస్ కాంట్రాక్ట్ అసిస్టెంట్ ప్రొఫెసర్ల మహాధర్నాలో వక్తలు
- సమస్యను వెంటనే పరిష్కరించాలని డిమాండ్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తెలంగాణ యూనివర్సిటీలలో పని చేస్తున్న కాంట్రాక్ట్ అసిస్టెంట్ ప్రొఫెసర్లందరినీ రెగ్యులర్ చేయాలని పలువురు నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తెలంగాణ యూనివర్సిటీస్ కాంట్రాక్ట్ అసిస్టెంట్ ప్రొఫెసర్ల జెఎసి ఆధ్వర్యంలో బుధవారం హైదరాబాద్ ఇందిరాపార్క్ ధర్నాచౌక్ వద్ద మహాధర్నా నిర్వహించారు. నాయకులు డా వేల్పుల కుమార్, డా ఉపేందర్ అధ్యక్షతన నిర్వహించిన ఈ ధర్నాలో ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ.. కాంట్రాక్టు అధ్యాపకుల డిమాండ్‌ను నెరవేర్చడంలో గత పాలకపక్షం విఫలమైందని, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే సమస్యను పరిష్కరించాలని కోరారు. రెగ్యులర్ చేసేవరకు ఐక్యంగా ఉద్యమించాలని, తమ సిపిఐ అండగా ఉంటుందని అన్నారు. మీ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి సత్వర పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఎంపీ ఆర్.కష్ణయ్య మాట్లాడుతూ.. మీకు న్యాయం జరిగే విధంగా తాను కొట్లాడుతానన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తలచుకుంటే ఎటువంటి చిక్కులూ రావని, కేంద్రంలో ఏదైనా మాట్లాడాల్సి వస్తే పార్లమెంట్‌లో తాను మాట్లాడుతానని అన్నారు.

మహాధర్నాలో మాట్లాడుతున్న వక్తలు

ప్రొఫెసర్ హరగోపాల్ మాట్లాడుతూ.. కాంట్రాక్టు కార్మికులందరినీ రెగ్యులర్ చేయాలని, సుప్రీంకోర్టు తీర్పు కూడా అనుకూలంగా ఉన్నదని, ఎటువంటి న్యాయపరమైన చిక్కులూ ఉండవని అన్నారు. శాసనమండలి మాజీ చైర్మెన్, ప్రస్తుత మండలి ప్రతిపక్ష నాయకులు డాక్టర్ మధుసూదనా చారి మాట్లాడుతూ.. లక్ష్యం నెరవేరే వరకు ఇదేవిధంగా ఉద్యమాన్ని కొనసాగించాలని, తమ వెంట తాముంటామని చెప్పారు. ఒయు ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ కాసిం మాట్లాడుతూ.. న్యాయమైన డిమాండ్ కోసం ఐక్యంగా ముందుకుపోవాలన్నారు. సిపిఎం సీనియర్ నాయకులు డిజి.నర్సింహారావు మాట్లాడుతూ.. 1990లో మొదలైన ఈ కాంట్రాక్టు వ్యవస్థ ఇప్పటికీ అనేక మంది జీవితాలను ఆగం చేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం వెంటనే అందరినీ వన్ టైం సెటిల్మెంట్ కింద రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేశారు. అందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి సమన్వయంగా పని చేయాలని కోరారు.

బీసీ వెల్ఫేర్ అసోసియేషన్ జాతీయ అధ్యక్షులు జాజుల శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ.. కాంట్రాక్టు అధ్యాపకులందరూ వెంటనే ఒక సమావేశం ఏర్పాటు చేసుకుని.. ఆ డెలిగేషన్ ద్వారా ప్రభుత్వాన్ని కలవాలని సూచించారు. కాంగ్రెస్ అధికార ప్రతినిధి హర్షవర్ధన్ రెడ్డి మాట్లాడుతూ.. మీ సమస్యను ప్రభుత్వం, సిఎం దృష్టికి తీసుకెళ్లి తగిన న్యాయం చేస్తానని, ఒక డెలిగేషన్‌ను తీసుకెళ్తానని చెప్పారు. బీజేపీ కార్యదర్శి కాసం వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే కాంట్రాక్ట్ అసిస్టెంట్ ప్రొఫెసర్లను క్రమబద్ధీకరణ చేయాలని, ఏదైనా యూజీసీ సంబంధించి అడ్డంకులు ఉంటే కేంద్రానికి ఉత్తరం రాయాలని, దాంతో సమస్యను పరిష్కరించే విధంగా కేంద్రాన్ని ఒప్పిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో పిఒడబ్ల్యు రాష్ట్ర అధ్యక్షులు అనసూయ, నాయకులు సంధ్య, జెఎసి నాయకులు డాక్టర్ ధర్మతేజ, డాక్టర్ పరశురాం, డాక్టర్ విజయేందర్ రెడ్డి, డాక్టర్ ఉపేందర్, డాక్టర్ వేల్పుల కుమార్, డాక్టర్ తాళ్లపల్లి వెంకటేశ్వర్లు, డాక్టర్ రవి, డాక్టర్ చిరారాజు, డాక్టర్ కరుణాకర్, ఆల్ యూనివర్సిటీ కాంటాక్ట్ టీచర్స్ జెఎసి కోఆర్డినేటర్ సభ్యులు డాక్టర్ సామర్ల విజయేందర్ రెడ్డి పాల్గొన్నారు.

నా బిడ్డను కాపాడండి సారూ..

- డీ అడిక్షన్ పేరుతో చిత్రహింసలు..
- ఫిర్యాదు చేసినా పట్టించుకోని పోలీసులు..

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

"నా బిడ్డను కాపాడండి సారూ.. గుర్తు తెలియని వ్యక్తులు ఎవరో తీసుకెళ్లారు" అని చిన్నకోడూరు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదంటూ వృద్ధురాలు వెంకవ్వ బుధవారం విలేకరులతో వాపోయారు. బాధితురాలు తెలిపిన కథనం ప్రకారం.. సిద్దిపేట జిల్లా చిన్నకోడూరు మండలం మాచాపూర్ గ్రామానికి చెందిన కొమ్మురాజుల నాగరాజు టైర్ పంక్చర్స్ పని చేస్తూ జీవనోపాధి పొందుతున్నారు. కాగా, శనివారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తి వచ్చి తన వాహనం టైర్ పంక్చర్ అయిందని తీసుకెళ్లాడు. తన కొడుకు రాత్రంతా ఇంటికి రాకపోవడంతో ఆందోళన చెందిన నాగరాజు తల్లి ఆదివారం ఉదయం చిన్నకోడూరు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దాంతో తన కొడుకు హైదరాబాద్‌లోని డీ అడిక్షన్‌లో ఉన్నాడని పోలీసులు తెలిపినట్టు చెప్పారు. దాంతో తాను అక్కడికి వెళ్లగా.. తన కొడుకును చూడడానికి అనుమతి లేదని నిరాకరించారని తెలిపారు. తన కొడుకును చూసే వరకు తాను ఇక్కడి నుంచి వెళ్లేది లేదని భీష్మించడంతో 30 సెకండ్లు మాత్రమే నాగరాజును చూయించారని బోరున విలపించింది. తన కొడుకు ఒంటినిండా గాయాలతో కనిపించాడని, మంచిగా ఉన్న తన కొడుకుకు మత్తు పదార్థాలు ఎక్కించి మతిస్థిమితం లేకుండా చేశారని తెలిపారు. తన కొడుకు మత్తు పదార్థాలు తీసుకున్నాడని పోలీసులకు నిర్ధారణ అయితే జైల్లో పెట్టాలి కానీ ప్రయివేట్ వ్యక్తులకు అప్పగించి, చిత్రహింసలకు గురిచేయడం ఏమిటని ప్రశ్నించారు. తన కొడుకును అప్పగించకపోతే తన చావును పోలీసులు కళ్లారా చూస్తారని హెచ్చరించారు. కాగా, ఈ విషయమై చిన్నకోడూరు ఎస్ఐ బాలకృష్ణను వివరణ కోరగా.. నాగరాజు భార్య.. ప్రభుత్వం ఆమోదం పొందిన డీ అడిక్షన్ సంస్థలో చేర్పించిందని తెలిపారు. ఆ డీ ఆడిక్షన్ సంస్థ యజమానితో మాట్లాడామని, నాగరాజు పరిస్థితి బాగానే ఉందని చెప్పారని అన్నారు. ఆమె తమకు అందుబాటులోకి రాలేదని, వస్తే పూర్తి వివరాలు వెల్లడిస్తామని తెలిపారు.

మే 20న సార్వత్రిక సమ్మె

- జయప్రదం చేయాలని రాష్ట్ర ఆటో, మోటార్ సంఘాల జెఎసి పిలుపు
- మే మొదటి వారంలో ర్యాలీలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

మే 20న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని తెలంగాణ రాష్ట్ర ఆటో, మోటార్ సంఘాల ఐక్య కార్యాచరణ కమిటీ (జెఎసి) పిలుపునిచ్చింది. బుధవారం హైదరాబాద్ విద్యానగర్ మార్క్స్ భవన్‌లో ఐక్య కార్యాచరణ కమిటీ రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. తెలంగాణ ప్రోగ్రెసివ్ ఆటో అండ్ మోటార్ వర్కర్స్ యూనియన్ (టియుసిఐ) రాష్ట్ర అధ్యక్షులు వి ప్రవీణ్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో పలు సంఘాల నేతలు పాల్గొన్నారు. సిఐటియు నాయకులు పి శ్రీకాంత్ మాట్లాడుతూ.. మోడీ కార్మిక, ప్రజావ్యతిరేక విధానాలను తిప్పి కొట్టాలని పిలుపునిచ్చారు. నాలుగు లేబర్ కోడ్స్‌ను రద్దు చేయాలని, అన్ని రంగాల కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. సెంట్రల్ మోటారు వెహికల్ యాక్ట్ (సవరణ) చట్టం 2019ను రద్దు చేయాలని, మోటర్ కార్మికులకు సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలని అన్నారు. కేంద్ర కార్మిక సంఘాల పిలుపును రాష్ట్ర ఆటో అండ్ మోటార్ సంఘాలు అమలు చేయాలని పిలుపు నిచ్చారు. ఈ నెల 25 లేదా 26 తేదీల్లో సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో రాష్ట్ర సదస్సు నిర్వహించాలని, మే మొదటి వారంలో రాష్ట్రవ్యాప్త వాహన ర్యాలీలు నిర్వహించాలని, మే 20న రాష్ట్ర వ్యాప్త నిరవధిక సమ్మెను జయప్రదం చేయాలని సమావేశం తీర్మానించింది. ఈ సమావేశంలో ఎఐటియుసి నాయకులు ఎస్ అశోక్, ఐఎన్‌టియుసి రాష్ట్ర నాయకులు బి.రామకృష్ణారెడ్డి, ఐఎఫ్‌టియుకె నాయకులు మంగ్ల, బిఆర్‌టియు నాయకులు సిహెచ్ బాల నరసింహ, టిజిఎఫ్‌డబ్ల్యుడిఎ నాయకులు సలావుద్దీన్, టిసిడియు నాయకులు ఎం కొండల్‌రెడ్డి, టిఎస్‌డిఎ నాయకులు జి అంజి, టిఆర్‌సిపిటియు నాయకులు సతీష్ కుమార్, ఎస్ రవీందర్, ఎస్ రామకృష్ణ, కె మహేష్, కె అజయ్ బాబు, ఎల్ కొండల్, సిహెచ్ జంగయ్య పాల్గొన్నారు.

అభివాదం తెలుపుతున్న జెఎసి నాయకులు

22 నుంచి 'స్టార్టప్ కాన్‌క్లేవ్ హైదరాబాద్ 2025'

ప్రారంభించనున్న కేంద్రమంత్రి జితేంద్రసింగ్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కౌన్సిల్ ఆఫ్ సైంటిఫిక్ అండ్ ఇండస్ట్రియల్ రీసెర్చ్ (సిఎస్ఐఆర్) ఆధ్వర్యంలో "క్యాటలైజింగ్ ఇన్నోవేషన్, కనెక్టింగ్ ఎకోసిస్టమ్స్" అనే ఇతివృత్తంతో ఐఐసిటి, సిసిఎంబి, ఎన్‌జిఆర్ఐ సంస్థలు సంయుక్తంగా నిర్వహిస్తున్న "స్టార్టప్ కాన్‌క్లేవ్ హైదరాబాద్ 2025" సదస్సుకు హైదరాబాద్ వేదిక కానుంది. ఈ మేరకు బుధవారం సిఎస్ఐఆర్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఐఐసిటి డైరెక్టర్ డి శ్రీనివాస్‌రెడ్డి, సిసిఎంబి డైరెక్టర్ డాక్టర్ వినయ్ నందికూరి, ఎన్‌జిఆర్ఐ డెరెక్టర్ డాక్టర్ ప్రకాష్‌కుమార్ సదస్సు వివరాలను వెల్లడించారు. రెండు రోజుల పాటు జరగనున్న సదస్సును కేంద్ర శాస్త్ర సాంకేతిక శాఖ మంత్రి డాక్టర్ జితేంద్ర సింగ్ ప్రారంభిస్తారని తెలిపారు. దేశ వ్యాప్తంగా కాన్‌క్లేవ్‌లో 70కి పైగా ఇంక్యుబెటర్లు పాల్గొంటాయని పేర్కొన్నారు. స్టార్టప్ ఎకోసిస్టమ్‌ను పెంపొందించడం, ఆవిష్కరణలను ప్రోత్సహించడం ప్రధాన లక్ష్యాలుగా ఈ సదస్సును ఏర్పాటు చేసినట్టు తెలిపారు. ఇంక్యుబెటర్లు, పెట్టుబడిదారులు, పారిశ్రామిక వేత్తలు, పరిశోధకులు, విధాన రూపకర్తలను ఒకే వేదికపై తీసుకొచ్చి కొత్త ఆవిష్కరణలకు ఈ సదస్సు నాంది అవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి జి. కిషన్‌రెడ్డి, మేడ్చల్ పార్లమెంటు సభ్యులు ఈటల రాజేందర్, స్థానిక ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి పాల్గొంటారని తెలిపారు.

అక్రమ కేసులకు భయపడరు

- టిపిసిసి అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్

ప్రజాశక్తి -హైదరాబాద్‌బ్యూరో

ఎఐసిసి అగ్రనేతలు సోనియాగాంధీ, రాహుల్‌గాంధీపై అక్రమ కేసులు పెడితే భయపడతారా? కేంద్ర ప్రభుత్వం టీపీసీసీ అధ్యక్షులు బొమ్మ మహేష్‌కుమార్‌గౌడ్ స్పష్టం చేశారు. హెరాల్డ్ పేపర్‌కు కాంగ్రెస్ పార్టీ డబ్బులు ఇస్తే మనీలాండరింగ్ ఎలా అవుతుందని ప్రశ్నించారు. బుధవారం హైదరాబాద్‌లోని ఆదర్శనగర్‌లో ఆయన విలేకర్లతో మాట్లాడారు. గాంధీ కుటుంబాన్ని అక్రమ కేసులతో లొంగదీసుకోవాలని ప్రయత్నించడం సరైంది కాదన్నారు. కక్ష సాధింపు చర్యల్లో భాగంగానే నేషనల్ హెరాల్డ్ కేసులో అక్రమ కేసులు నమోదు చేస్తున్నారని విమర్శించారు.

బాదంతో కండరాల పుష్టి

- వెల్నెస్ కన్సల్టెంట్ షీలా కృష్ణ స్వామి

ప్రజాశక్తి - హైదరాబాద్

రోజువారి ఆహారంలో బాదం పప్పును తీసుకోవడం ద్వారా కండరాలు పుష్టిగా మారుతాయని న్యూట్రిషన్ అండ్ వెల్నెస్ కన్సల్టెంట్ షీలా కృష్ణస్వామి అన్నారు. బుధవారం హైదరాబాద్‌లో ఇండియన్ డైటెటిక్ అసోసియేషన్ తెలంగాణ చాప్టర్, ఆల్మండ్ బోర్డ్ ఆఫ్ కాలిఫోర్నియా సంస్థలు సంయుక్తంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో షీలా మాట్లాడుతూ.. బాదం పప్పుతో అనేక ఆరోగ్య ప్రయోజనాలున్నాయన్నారు. రక్తంలో చక్కెర స్థాయిలను నియంత్రిస్తాయన్నారు. ఈ కార్యక్రమానికి అపోలో హాస్పిటల్స్ చీఫ్ డైటీషియన్ హరితా శ్యామ్ బి సంధానకర్తగా వ్యవహరించారు.

జిపి కార్మికులకు ఇచ్చిన హామీలు అమలు ఏమయ్యాయి?

- సిఐటియు జిల్లా అధ్యక్షులు సిహెచ్ లక్ష్మీనారాయణ
- నల్లగొండ కలెక్టరేట్ ఎదుట ధర్నా

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు గ్రామపంచాయతీ కార్మికులకు ఇచ్చిన వాగ్దానాలను అమలు చేయాలని సిఐటియు నల్లగొండ జిల్లా అధ్యక్షులు చినపాక లక్ష్మీనారాయణ డిమాండ్ చేశారు. గ్రామపంచాయతీ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం బుధవారం నల్లగొండ జిల్లా కలెక్టరేట్ ఎదుట భారీ ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిపి కార్మికుల కనీస వేతనాలు, పర్మినెంట్, ఇతర సమస్యలను వెంటనే పరిష్కరించాలని, లేనియెడల రాష్ట్ర వ్యాప్తంగా నిరవధిక సమ్మెకు సిద్ధమవుతామని హెచ్చరించారు. పారిశుధ్యం, మంచినీటి సరఫరా, వీధిలైట్ల నిర్వహణ, పన్నుల వసూలు పనులు నిర్వహిస్తూ ప్రజలకు అనేక సేవలు అందిస్తున్న పంచాయతీ కార్మికుల పట్ల ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలో కొస్తే గ్రామపంచాయతీ కార్మికుల కనీస వేతనాలు పెంచుతామని, అర్హత కలిగిన వారిని పర్మినెంట్ చేస్తామని హామీ ఇచ్చారని, ఇంతవరకు ఏ ఒక్క సమస్యా పరిష్కారం కాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం వెంటనే కార్మికుల వేతనం పెంచాలని డిమాండ్ చేశారు. కార్మికుల ఉద్యోగ భద్రతకు ముప్పుగా ఉన్న మల్టీ పర్పస్ విధానాన్ని రద్దు చేయాలని, అర్హత కలిగిన కార్మికులను పర్మినెంట్ చేయాలని, ప్రమాద బీమా రూ.10 లక్షలు చెల్లించాలని, బిల్ కలెక్టర్ కారోబార్లకు ప్రత్యేక హెూదా కల్పించాలని కోరారు. జిల్లాలో గతంలో ఇచ్చిన సర్క్యులర్‌ను అమలు చేయకుండా అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. పోస్టల్ బీమా, ఆదివారం సెలవు, ఎనిమిది గంటల పని, బట్టలు, చెప్పులు, నూనెలు వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం జిల్లా అదనపు కలెక్టర్ శ్రీనివాస్, జిల్లా పంచాయతీ అధికారి వెంకయ్యక వినతిపత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి చింతపల్లి బయన్న, పొన్న అంజయ్య, పి సర్వయ్య, ఎర్ర అరుణ, నరసయ్య, జానయ్య, రామలింగయ్య, ఎండి జహీర్, పి చంద్రయ్య, సైదులు, మరియమ్మ, రమేష్, ఎల్లయ్య పాల్గొన్నారు.

గ్రామపంచాయతీ కార్మికులతో మాట్లాడుతున్న లక్ష్మీనారాయణ

బస్సుయాత్రలో మల్లు లక్ష్మి

మహిళా హక్కుల సాధనకు ఐక్యంగా ఉద్యమించాలి

- రాజ్యాంగ హక్కుల అమలులో కేంద్ర ప్రభుత్వం విఫలం : మల్లు లక్ష్మి
- మహబూబాబాద్ జిల్లాలో బస్సు యాత్రకు ఘనస్వాగతం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

హక్కుల సాధన కోసం మహిళలు ఐక్యంగా ఉద్యమించాలని ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మీ పిలుపునిచ్చారు. అంబేద్కర్, పూలే జయంతిని పురస్కరించుకొని ఐద్వా ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా మహిళా హక్కుల పరిరక్షణ బస్సు యాత్రను చేపట్టారు. ఈ యాత్ర బుధవారం మధ్యాహ్నం మహబూబాబాద్ జిల్లాకు చేరుకున్న సందర్భంగా నర్సంపేట బైపాస్ రోడ్డు వద్ద జిల్లా ప్రజాసంఘాల నాయకులు ఘన స్వాగతం పలికారు. అనంతరం ఐద్వా జిల్లా కార్యదర్శి గాడిపెల్లి ప్రమీల అధ్యక్షతన జరిగిన సభలో మల్లు లక్ష్మి మాట్లాడారు. రాజ్యాంగంలో స్త్రీ, పురుషులకు సమాన హక్కులు కల్పించినప్పటికీ మహిళలపై అసమానత్వం కొనసాగుతుందన్నారు. విద్యా, వైద్యం, ఉపాధి కల్పనలో ఇంకా స్త్రీలు వెనుకబడి ఉన్నారని అన్నారు. పోరాడి సాధించుకున్న హక్కులు, రాజ్యాంగ హక్కుల అమలులో కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం వైఫల్యం చెందిందని తెలిపారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ 'భేటీ బచావో..' అంటూనే మహిళపై జరుగుతున్న దాడులు, హింస, లైంగికదాడులు, హత్యలు, కుల దురహంకార హత్యల గురించి మాత్రం నోరు మెదపరని ఆగ్రహం వ్యక్తం చేశారు. బిల్ కీస్ భానుపై లైంగికదాడి, ఆమె కుటుంబం హత్య కేసులో నేర నిర్ధారణ జరిగి శిక్ష అనుభవిస్తున్న 11 మంది ఖైదీలను విడుదల చేయించి శాలువాలతో సత్కరించారని, మహిళా మల్లయోధులపై లైంగిక వేధింపులు జరిగినప్పుడు కేసు నమోదు చేయడానికి ఆరునెలలు పట్టిందని గుర్తుచేశారు. మణిపూర్‌లో ఇద్దరు గిరిజన మహిళలపై ఆర్జీకార్ ఘటనను రాజకీయ ప్రయోజనం కోసం ఉపయోగించుకున్నారని, బాధితులకు మాత్రం న్యాయం చేయలేదని తెలిపారు. భూమి, భుక్తి, వెట్టిచాకిరి విముక్తి కోసం.. స్త్రీ, పురుషులు కుల మతాలకతీతంగా సాగించిన వీర తెలంగాణ సాయుధ పోరాట వారసత్వం ఉన్న తెలంగాణ గడ్డపై నేడు కుల దురహంకార హత్యలు జరగడం దారుణమన్నారు. మహిళా హక్కుల పరిరక్షణతో పాటు దేశ అభివృద్ధిలో మహిళల భాగస్వామ్యం కోసం ఐద్వా రాష్ట్ర కమిటీ చేపట్టిన యాత్రను జయప్రదం చేయాలని కోరారు. రానున్న రోజుల్లో పూలే, అంబేద్కర్ స్ఫూర్తితో స్త్రీల హక్కుల కోసం పోరాటాలు కొనసాగిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐద్వా జిల్లా ప్రధాన కార్యదర్శి కందునూరి కవిత, పట్టణ కార్యదర్శి చాగంటి భాగ్యమ్మ, నాయకులు వాంకుడోతు రమాదేవి, అల్వాల సత్యవతి, మల్లెల నాగమణి, వేల్పుగొండ సావిత్ర, మమత, తాళ్లపల్లి రమ, తలారి శైలజ, సుజాత, జక్కుల స్వరూప, ఎస్ఎఫ్ఐ, డివైఎఫ్ఐ, కేవీపీఎస్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల పైకప్పు పెచ్చులూడి విద్యార్థినికి తీవ్ర గాయాలు

- ధరూర్ మండలం మున్నూరు ప్రాథమిక పాఠశాలలో ఘటన

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

పాఠశాల పైకప్పు పెచ్చులూడి విద్యార్థినిపై పడడంతో తీవ్ర గాయాలయిన ఘటన వికారాబాద్ జిల్లా ధరూర్ మండలం మున్నూరు సోమారం ప్రాథమిక పాఠశాలలో బుధవారం జరిగింది. పాఠశాల సిబ్బంది తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని మున్నూరు సోమారం ప్రాథమిక పాఠశాలలో ఒకటో తరగతిలో పది మంది విద్యార్థులు హాజరయ్యారు. వారు తరగతి గదిలో ఉండగా పాఠశాల పైకప్పు పెచ్చులూడి విద్యార్థిని శిరీష తలపై పడటంతో తలకు, చెవికి, కాళ్లకు గాయాలయ్యాయి. సకాలంలో స్పందించిన పాఠశాల ఉపాధ్యాయులు, తల్లిదండ్రులతో కలిసి ఆ విద్యార్థిని వికారాబాద్‌లోని మా శారద హాస్పిటల్‌కు తరలించి చికిత్స అందించారు. ఘటన విషయం తెలుసుకున్న జిల్లా విద్యాధికారి రేణుకాదేవి ఆస్పత్రికి వెళ్లి బాలికను పరామర్శించారు. చిన్నారి పరిస్థితి నిలకడగా ఉందని వైద్యులు తెలిపారు. పెచ్చులూడుతున్న పాఠశాల గదులను కూల్చి వేసి వెంటనే కొత్త భవనాన్ని నిర్మించాలని గ్రామస్తులు కోరారు.

ఘటనపై ఆరా తీస్తున్న పోలీసులు

పాఠశాలలో విష ప్రయోగం

- ప్రధానోపాధ్యాయురాలి అప్రమత్తతతో విద్యార్థులకు తప్పిన ముప్పు
- నిందితుడిని అరెస్టు చేసిన పోలీసులు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఆదిలాబాద్ జిల్లా ఇచ్చోడ మండలం ధర్మపురి పాఠశాలలో విష ప్రయోగం జరిగింది. ప్రధానోపాధ్యాయురాలి అప్రమత్తతతో విద్యార్థులకు పెద్ద ప్రమాదం తప్పింది. ఇందుకు సంబంధించి సిఐ భీమేష్ తెలిపిన వివరాల ప్రకారం.. పాఠశాలలకు వరుసగా మూడు రోజులు సెలవులు వచ్చాయి. మంగళవారం ఉదయం ధర్మపురి పాఠశాలకు వెళ్లిన ప్రధానోపాధ్యాయురాలు ప్రతిభ వంటగది తాళం పగులగొట్టి ఉండటం, అందులో ఒక పాత్ర, బకెట్‌లో తెలుపు రంగులో నీరు ఉండటాన్ని గమనించారు. సామాగ్రిపై కూడా కలుషిత నీరు ఉండటం, దుర్వాసన వస్తుండటంతో మాజీ సర్పంచ్‌తో పాటు గ్రామ పెద్దల దృష్టికి తీసుకెళ్లారు. వారు పాఠశాలకు వచ్చి పరిశీలించగా అది పురుగుల మందు అని గుర్తించారు. వెంటనే ప్రధానోపాధ్యాయురాలు పోలీసులకు ఫిర్యాదు చేశారు. విచారణ చేపట్టిన పోలీసులు గోండుగూడ నివాసి అయిన సోయం కిష్టుపై అనుమానంతో విచారించారు. తానే పురుగులమందు తీసుకొచ్చి పాఠశాల వంటగది తాళాన్ని పగలగొట్టి పాత్రల్లో పోసినట్టు అంగీకరించాడు. కిష్టు కుటుంబ కలహాల కారణంగా మానసిక పరిస్థితి బాగాలేకపోవడం, ఇంట్లో వారిపై కోపంతో ఈ ఘటనకు పాల్పడ్డట్టు పోలీసులు గుర్తించారు. ఆయనపై కేసు నమోదు చేసి అరెస్టు చేశారు. సంఘటనా స్థలాన్ని ఉట్నూర్ ఏఎస్పీ కాజల్‌సింగ్ పరిశీలించారు. ఆమె వెంట సీఐ, ఎస్ఐ తిరుపతి ఉన్నారు.